లబ్ధిదారులతో మాట్లాడుతున్న కలెక్టర్

అర్జీలను పరిష్కరించడంలో జాప్యం వద్దు

- కలెక్టర్ సత్య ప్రసాద్
- ప్రజావాణిలో 46 ఫిర్యాదులు

జగిత్యాల, అక్టోబర్ 21 : ప్రజావాణిలో వచ్చే అర్జీలను పరిష్కరించడంలో జాప్యం చేయొద్దని కలెక్టర్ బీ సత్యప్రసాద్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో ప్రజల నుంచి ఫిర్యాదులు, వినతులను అదనపు కలెక్టర్లు రాంబాబు, గౌతమ్ రెడ్డితో కలిసి కలెక్టర్ స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అర్జీలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. కాగా, ప్రజావాణికి మొత్తం 46 ఫిర్యాదులు, వినతులు వచ్చాయని, వాటిని వెంటనే అధికారులను పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అదనపు కలెక్టర్లు పీ రాంబాబు, గౌతమ్ రెడ్డి, మెట్‌పల్లి ఆర్డీవో శ్రీనివాస్, కలెక్టరేట్ ఏవో హన్మంత్ రావు, వివిధ జిల్లా అధికారులు, కలెక్టరేట్ పర్యవేక్షకులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఏఎన్ఎంపై చర్యలకు ఆదేశం

నలభై రోజుల క్రితం జిల్లా కేంద్రంలోని బీరయ్య గుడి వద్ద ఉన్న అంగన్‌వాడీ సెంటర్లో బాలింత జల తన మూడు నెలల పాపకు టీకా వేయించింది. అయితే ఏఎన్ఎం ఫోన్ మాట్లాడుతూనే ఎడమ కాలి తోడకు కాకుండా కుడి కాలి తోడకు టీకా ఇచ్చిందని తల్లి ఆరోపించింది. తర్వాత టీకా వేసిన దగ్గర గడ్డలాగా మారడంతో ఏఎన్ఎం మాతా శిశు సంరక్షణ కేంద్రానికి తీసుకెళ్లి వైద్యం చేయించిందని చెప్పింది. అయినా తగ్గకపోవడంతో ప్రైవేట్ దవాఖానలో వైద్యం చేయించానని చెప్పింది. నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఏఎన్ఎంపై చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌కు ఫిర్యాదు చేసింది. ఈ విషయమై కలెక్టర్ సత్యప్రసాద్ వైద్యాధికారులతో మాట్లాడుతూ, చిన్నారికి టీకా వేసిన ఏఎన్ఎంపై చర్య తీసుకోవాలని, చిన్నారికి మెరుగైన వైద్యం అందించాలని సూచించారు.

మాకు సహాయం అందించాలి

కోరుట్ల, మల్యాల, జగిత్యాల, కొడిమ్యాల, మల్యాల, బల్వంతాపూర్, గొల్లపల్లికి చెందిన స్పైనల్ కార్డ్ బాధితులు కలెక్టర్‌కు వినతిపత్రం అందించారు. స్పైనల్ కార్డుకు దెబ్బ తగిలి మేం నడవలేని స్థితిలో ఉన్నామని, జిల్లాలో తమలాంటోళ్లు 20 మంది వరకు ఉన్నారని వివరించారు. తమకు ప్రత్యేక మంచాలు, పింఛన్ లాంటివి అందించాలని కోరారు.

సమస్యల పరిష్కారానికే ప్రజావాణి

పెగడపల్లి, అక్టోబర్ 21: ప్రజా సమస్యల పరిష్కారం కోసమే ప్రజావాణి కార్యక్రమాన్ని ప్రభుత్వం నిర్వహిస్తోందని తహసీల్దార్ రవీందర్ పేర్కొన్నారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యక్రమంలో అధికారులు ప్రజావాణి నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ ప్రజలు తమ సమస్యలపై ఫిర్యాదు చేస్తే, విచారించి పరిష్కరిస్తామని వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీవో మహేందర్, ఏఈ శంషేర్‌అలీ, ఏపీఎం సమత, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు మహేశ్వరి, సుబద్ర, ఏపీవో అనిల్‌కుమార్, ప్రసాద్ తదితరులున్నారు.

అయోడిన్ లోపం లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

జగిత్యాల అర్బన్, అక్టోబర్ 21 : శరీరంలో అయోడిన్ లోపం లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యాధికారి సమీయొద్దీన్ సూచించారు. అయోడిన్ డిఫిషియన్సీ డిజార్డర్స్ కంట్రోల్ డే సందర్భంగా వైద్యాధికారి కార్యాలయంలో వైద్యాధికారి సోమవారం వైద్యాధికారులు, వైద్యులు, సిబ్బందికి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జిల్లా వైద్యాధికారి మాట్లాడుతూ మనం నిత్యం తినే ఆహారంలో ప్రతి రోజూ ఐదు గ్రాముల అయోడైస్డ్ సాల్ట్ ఉండేటట్లు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అయోడిన్ లోపంతో గర్భస్రావం, మృత శిశువు జననం, అసంపూర్ణ పిండం, పిండం మెదడు అభివృద్ధి చెందకపోవడం, తక్కువ మానసిక శారీరక పెరుగుదల, గాయిటర్, బుద్ధి మాంద్యం, మరుగుజ్జుతనం, తక్కువ అభ్యసన సామర్థ్యాలు వస్తాయన్నారు. జిల్లా ఉప వైద్యాధికారి శ్రీనివాస్, ప్రోగ్రాం ఆఫీసర్లు జైపాల్‌రెడ్డి, అర్బన్ హెల్త్ సెంటర్ల వైద్యులు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

ప్రణాళికాబద్ధంగా ఓటర్ జాబితా సవరణ

రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి

జగిత్యాల, అక్టోబర్ 21 : జిల్లాలో ఓటర్ జాబితా సవరణ 2024-25 సంబంధించి ప్రణాళికాబద్ధంగా స్వీప్ కార్యక్రమాలు నిర్వహించాలని రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి ఆదేశించారు. సోమవారం ఎమ్మెల్సీ స్థానాల ఓటరు విచారణ, ఓటరు జాబితా రూపకల్పనపై జిల్లా కలెక్టర్లతో రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్సీ ఓటర్ల నమోదుకు వస్తున్న దరఖాస్తుల విచారణ మిషన్‌మోడ్‌లో పూర్తి చేయాలన్నారు. ఓటర్ నమోదు దరఖాస్తులను నవంబర్ 29 వరకు స్వీకరిస్తామని, డిసెంబర్ 26 వరకు అభ్యంతరాలను పరిష్కరించి జనవరి 6న తుది ఓటర్ జాబితా ప్రచురించాలని తెలిపారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ సత్యప్రసాద్, తహసీల్దార్ పాల్గొన్నారు.

కరువు భత్యం వెంటనే విడుదల చేయాలి

జగిత్యాల టౌన్, అక్టోబర్ 21 : ఉద్యోగ, ఉపాధ్యాయ పెన్షనర్లకు తెలంగాణ రాష్ట్రంలో బకాయిపడిన ఐదు విడుతల కరువు భత్యంను వెంటనే విడుదల చేయాలని టీఆర్టీఎఫ్ జిల్లా అధ్యక్షుడు తుంగూరి సురేశ్, జిల్లా ప్రధాన కార్యదర్శి గుర్రం శ్రీనివాస్‌గౌడ్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం జగిత్యాలలో టీఆర్టీఎఫ్ సంఘ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా తుంగూరి సురేశ్ మాట్లాడుతూ 2022 జూలై నుంచి ఇప్పటి వరకు ఐదు విడుతల కరువు భత్యం అందించాల్సి ఉందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించాలన్నారు. లేకుంటే పోరుబాటకు ఉద్యోగులు సిద్ధపడతారన్నారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు నాయిని విజయానందరావు, నాయకులు ఓదెల శేఖర్ పాల్గొన్నారు.

శివాలయంలో రుద్ర హోమం

రాయికల్, అక్టోబర్ 21 : రాయికల్ పట్టణంలోని శివాలయంలో సోమ వారం వేద పండితులు, అర్చకులు రుద్ర హోమాన్ని నిర్వహించారు. అనంతరం ఆలయంలో సంప్రోక్షణ నిర్వహించి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భం గా పట్టణం, మండలంలోని పలు గ్రామాల నుంచి వచ్చిన భక్తులు స్వామివా రిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి రుద్ర హోమంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. రుద్ర హోమం పురస్కరించుకుని భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.

పూజలు చేస్తున్న జీవన్ రెడ్డి

హత్య చేసిన నిందితులను శిక్షించాలి

- ఓబులాపూర్ మృతుడి బంధువుల ఆందోళన
- రహదారిపై బైఠాయింపు,
- కుటుంబ సభ్యుల ఆత్మహత్యాయత్నం
- అడ్డుకున్న పోలీసులు

బాధితులను సముదాయిస్తున్న పోలీసులు

మెట్‌పల్లి, అక్టోబర్ 21 : మండలంలోని ఓబులాపూర్‌లో జరిగిన హత్యా సంఘటనలో నిందితులను కఠినంగా శిక్షించాలని బాధితులు డిమాండ్ చేశారు. సోమవారం మెట్‌పల్లి పట్టణంలోని కొత్త బస్టాండ్ సమీపంలో 64వ నంబరు జాతీయ రహదారిపై బైఠాయించి ఆందోళన చేశారు. ఆస్తి తగాదా విషయంలో అన్న సాయిలును చంపిన చందుతో పాటు అతడికి సహకరించిన వారిని పట్టుకొని శిక్షించాలని డిమాండ్ చేశారు. నిందితుల్లో కొందరిని తప్పించే ప్రయత్నం జరుగుతుందంటూ ఆరోపించారు. తమకు న్యాయం జరిగే వరకు ఆందోళన విరమించేది లేదన్నారు. పోలీసులు నిష్పక్షపాతంగా దర్యాప్తు చేపట్టి నిందితులను శిక్షించాలని నినదించారు. ఈక్రమంలో మృతుని కుటుంబ సభ్యులు ఒంటిపై పెట్రోలు పోసుకొని ఆత్మహత్యాయత్నం చేసుకోగా, పోలీసులు అడ్డుకున్నారు. హత్యతో సంబంధమున్న వారిని పట్టుకొని న్యాయం చేస్తామని మెట్‌పల్లి డీఎస్పీ ఉమామహేశ్వర్‌రావు హామీ నివ్వడంతో ఆందోళన విరమించారు.

- పోలీసుల కృషితోనే శాంతియుత వాతావరణం
- కలెక్టర్ సత్యప్రసాద్
- అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయం
- ఎస్పీ అశోక్ కుమార్

జగిత్యాల : పోలీస్ అమరవీరులకు నివాళులర్పిస్తున్న కలెక్టర్, ఎస్పీ, పోలీసు అధికారులు

ప్రజా సంరక్షణకే పోలీసు వ్యవస్థ

జగిత్యాల కలెక్టరేట్, అక్టోబర్ 21 : ప్రజల అవసరాలు, ప్రజా రక్షణ కోసం ఏర్పడ్డదే పోలీసు వ్యవస్థ అని, మనం అనుభవిస్తున్న శాంతియుత వాతావరణం పోలీసుల కృషితోనే సాధ్యమైందని కలెక్టర్ సత్యప్రసాద్ పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని పోలీసు పరేడ్ గ్రౌండ్‌లో పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం (ఫ్లాగ్ డే)కు కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరై ఎస్పీ అశోక్‌కుమార్, పోలీసు అమరవీరుల కుటుంబ సభ్యులతో కలిసి పోలీసు అమరవీరుల స్థూపానికి పూలమాల వేసి, శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజల రక్షణ కోసం ప్రాణాలర్పించిన పోలీసు అమరవీరుల త్యాగం భావి తరాలు స్ఫూర్తిగా నిలుస్తుందన్నారు. అక్టోబర్ 21 నుంచి 31 వరకు ప్రజలకు పోలీసులు మరింత చేరువయ్యేందుకు పోలీసులు చేస్తున్న ప్రత్యేక కార్యక్రమాలు అభినందనీయమన్నారు. విధి నిర్వహణలో అమరలైన పోలీసు కుటుంబ సభ్యులకు సహాయ సహకారాలు అందిస్తూ వారికి ఎల్లప్పుడూ ముందుంటామన్నారు. శాంతి భద్రతల పరిరక్షణ, నక్సల్స్ ఏరివేతలో ప్రాణాలు కోల్పయిన వారిని కలెక్టర్ స్మరించుకున్నారు. ఈ సందర్భంగా ఎస్పీ అశోక్ కుమార్ మాట్లాడుతూ పోలీసు వ్యవస్థ పటిష్టంగా ఉంటే అభివృత్తి ప్రతి ఒక్కరికీ చేరుతుందనడానికి తెలంగాణ రాష్ట్రమే ఒక ఉదాహరణ అన్నారు. ప్రతి సంవత్సరం అక్టోబర్ 21 నుంచి 31 వరకు పోలీసు అమరవీరుల సంస్మరణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. అంతకు ముందు కలెక్టర్, ఎస్పీలకు పోలీసులు గౌరవ వందనం చేశారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ భీమ్‌రావు, డీఎస్పీలు రవింద్రకుమార్, రఘుచందర్, ఉమామహేశ్వర్‌రావు, రంగారెడ్డి, డీసీఆర్‌బీ, సీసీఎస్, ఐటీ కోర్ ఇనిస్పెక్టర్లు శ్రీనివాస్, లక్ష్మీనారాయణ, రఫీక్ ఖాన్, ఏఆర్ ఇన్‌స్పెక్టర్లు కిరణ్‌కుమార్, రామకృష్ణ, వేణు, సీఐలు వేణుగోపాల్, రామ్ నర్సింహారెడ్డి, రవి, నిరంజన్‌రెడ్డి, సురేశ్, ఎస్సైలు, పోలీసులు, పోలీసు అమరవీరుల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

ధర్మపురి : అమరవీరుల స్తూపం వద్ద నివాళులర్పిస్తున్న పోలీస్ సిబ్బంది

జగిత్యాల కలెక్టరేట్ : విద్యార్థులకు పండ్లు పంపిణీ చేస్తున్న డీఎస్పీ, సీఐలు

పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం

ధర్మపురి : ధర్మపురిలో పోలీస్ అమరవీరుల స్థూపం వద్ద పోలీసులు పూలుచల్లి నివాళులర్పించారు. విధి నిర్వహణలో అసువులు బాసిన పోలీస్ అమరవీరులకు ఆత్మలకు శాంతి చేకూరాలని కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో సీఐ రాంనర్సింహారెడ్డి, ఎస్ఐలు మహేశ్, శ్రీధర్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

సారంగాపూర్: మండల కేంద్రంలోని సారంగాపూర్ పోలీస్‌స్టేషన్ ఆవరణలో అమరులకు ఘన నివాళులర్పించారు. ఏ రాజయ్య అమరవీరుడి విగ్రహానికి పూలమాలలు వేసి, రెండు నిమిషాలు మౌనం పాటించారు. ఎస్ఐ దత్తాద్రి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు పండ్లు పంపిణీ చేసిన పోలీసులు

జగిత్యాల కలెక్టరేట్: పోలీసు అమరవీరుల సంస్మరన దినోత్సవాన్ని పురస్కరించుకొని డీఎస్పీ రఘుచందర్, సీఐ వేణుగోపాల్ జిల్లా కేంద్రంలోని వాల్మీకి ఆవాసంలో విద్యార్థులకు పండ్లు పంపిణీ చేశారు. ఏకాగ్రతతో విద్యనభ్యసించి ఉన్నత స్థాయికి చేరుకోవాలని వారు విద్యార్థులకు సూచించారు.

మొక్కట్రావుపేటలో ఒకరి అనుమానాస్పద మృతి

వెల్గటూర్, అక్టోబర్ 21 : మండల కేంద్రంలోని మొక్కట్రావుపేటకు చెందిన మ్యాకల రాజయ్య (40) సోమవారం ఉదయం ఇంట్లో అనుమానాస్పదంగా మృతి చెందాడు. ఈ విషయాన్ని మృతుడి తమ్ముడు మహేశ్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, ఈ మెరకు ఎస్సై ఉమాసాగర్ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. మృతుడి భార్య రాధ, ఇద్దరు కూమారులు ఉన్నారు.

నేడు పెగడపల్లి మండలంలో ప్రభుత్వ విప్ పర్యటన

పెగడపల్లి, అక్టోబర్ 21 : మండలంలో మంగళవారం ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ పర్యటిస్తారని, కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు బుర్ర రాములుగౌడ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల కేంద్రంతో పాటు, మండలంలోని ల్యాగలమర్రి, వివిధ గ్రామాల్లో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను విప్ లక్ష్మణ్‌కుమార్ ప్రారంభిస్తారని వివరించారు.

విద్యార్థులకు ప్యాడ్లు పంపిణీ

ఇబ్రహీంపట్నం, అక్టోబర్ 21 : మండలంలోని కోమటి కొండాపూర్ ప్రభుత్వ ప్రాథమిక ఉన్నత పాఠశాలలో చదువుతున్న 60 మంది విద్యార్థులకు శ్రీసత్య సాయి సేవా సమితి ఆధ్వర్యంలో సోమవారం ప్యాడ్లు, పెన్నులను పంపిణీ చేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్ రెడ్డి, సమితి జిల్లా సేవాదళ్ కో- ఆర్డినేటర్ శేషశయన, కన్వీనర్ శ్రీనివాస్, ఆధ్యాత్మిక కో-ఆర్డినేటర్ ఆనంద్, జ్యోతి, కార్తికేయ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని మృత దేహం లభ్యం

కోరుట్ల, అక్టోబర్ 21 : పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో గుర్తు తెలియని మృతదేహాన్ని సోమవారం పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. మృతుడికి సుమారు 40 ఏళ్ల వయస్సు ఉంటుందని, అచూకీ తెలిసిన వారు కోరుట్ల పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలని ఎస్ఐ శ్రీకాంత్ తెలిపారు. శవాన్ని ప్రభుత్వ ఏరియా దవాఖాన మార్చురిలో భద్రపరిచినట్లు పేర్కొన్నారు. మృతుడిని గుర్తిస్తే ఫోన్ నంబర్ల 8712656790, 8712656820 ను సంప్రదించాలన్నారు.

నిందితుడిని శిక్షించాలి

కొడిమ్యాల, అక్టోబర్ 21: మండల కేంద్రంలో సోమవారం విశ్వహిందు పరిషత్, హిందు ఏక్తా సంయుక్త ఆధ్వర్యంలో సల్మాన్ అలీ దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. ఇటీవల సికింద్రాబాద్ ముత్యాలమ్మ ఆలయంలో విగ్రహాన్ని ధ్వంసం చేసిన సదరు నిందితుడిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. నాయకులు రాచకొండ చంద్రమోహన్. బోగ రాకేశ్. మాణిక్యం శ్రీను, తదితరులున్నారు.

మత్స్యకారులకు చేప పిల్లల పంపిణీ

కథలాపూర్, అక్టోబర్ 21 : జిల్లా మత్స్యకారులకు 83.35 లక్షల చేప పిల్లలు ప్రభుత్వం ఉచితంగా పంపిణీ చేస్తుందని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు. సోమవారం మండలంలోని తాండ్రాల గ్రామంలోని ఊరచెరువులో ప్రభుత్వం ఉచితంగా సరఫరా చేసిన చేప పిల్లలను వదిలారు. పలువురికి సీఎం ఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. జిల్లా మత్స్యశాఖ అధికారి విజయభారతి, ఫిషర్మెన్ రాష్ట్ర కార్యదర్శి కల్లెడ గంగాధర్, ఎంపీడీవో శంకర్, కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు కాయితి నాగరాజు, నాయకులు తొట్ల అంజయ్య, చెదలు సత్యనారాయణ, ధనుంజయ్‌రెడ్డి, గంగప్రసాద్, చారీ, ప్రవీన్, దర్మేంధర్, అజీమ్ పాల్గొన్నారు.

చెరువులో చేప పిల్లలను వదులుతున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, అధికారులు

అర్హులైన రైతుందరికీ రుణాలు

పెగడపల్లి, అక్టోబర్ 21 : అర్హులైన రైతులందరికీ సహకార సంఘం నుంచి పంట రుణాలు అందించనున్నట్లు మండలంలోని నంచర్ల సహకార సంఘం చైర్మన్ మంత్రి వేణుగోపాల్ తెలిపారు. సోమవారం నంచర్లలో సహకార సంఘానికి చెందిన పెట్రోల్ బంక్ ఆవరణలో సంఘం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘ చైర్మన్ వేణుగోపాల్ మాట్లాడుతూ సంఘం పరిధిలోని అర్హులైన రైతులందరూ పంట రుణాలు తీసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా వాయిదా మీరిన అప్పులు చెల్లించి, సంఘ అభివృద్ధికి సహకరించాలని కోరుతూ, 2023-24 ఆర్థిక సంవత్సరం ఆడిట్ ఆమోదానికి సంఘ సభ్యులు తీర్మానించారు. సంఘ కార్యదర్శి రౌతు మధుకర్, సహకార అధికారి మల్లేశం, సంఘం ఉపాధ్యక్షుడు నామ సురేందర్‌రావు, డైరెక్టర్లు రాజు ఆంజనేయులు, క్యాతం రవీందర్‌రెడ్డి, ముద్దం మల్లేశం, బొల్లవేని మల్లేశం, అజ్మీరా శ్రీనివాస్, దాసరి లింగయ్య, బైన అంజయ్య, 300 మంది వరకు సంఘ సభ్యులు హాజరయ్యారు.

మాట్లాడుతున్న చైర్మన్ వేణుగోపాల్

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

మేడిపల్లి, అక్టోబర్ 21 : భీమారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2007-2008లో 10వ తరగతి చదివిన పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం సోమవారం నిర్వహించారు. ఆనాటి ఉపాధ్యాయులను సన్మానించారు. అనంతరం ఒకరికొకరూ అప్యాయంగా పలకరించుకుంటూ ఆనాటి మధుర జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. టీచర్ లింగారెడ్డి, గంగాధర్, రాజ రెడ్డి, మోహన్, శ్యాంసుంధర్, శరత్ పాల్గొన్నారు.

స్కూల్ ఇన్నోవేషన్ మారథాన్

జగిత్యాల టౌన్, అక్టోబర్ 21 : జిల్లాలోని అన్ని పాఠశాలల నుంచి విద్యార్థులను స్కూల్ ఇన్నోవేషన్ మారథాన్‌లో పాల్గొనేలా చూడాలని జిల్లా విద్యాధికారి జగన్మోహన్‌రెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలోని అన్ని యాజమాన్య ప్రధానోపాధ్యాయులకు అటల్ టింకరింగ్ ల్యాబ్ కలిగి ఉన్న పాఠశాలలు తప్పనిసరిగా పాల్గొనాలని ఆదేశించారు. జిల్లాలో కనీసం 100 పాఠశాలల నుంచి 30 మంది విద్యార్థులు పాల్గొనటానికి అవకాశం ఉన్నట్లు జిల్లా విద్యాధికారి పేర్కొన్నారు. పూర్తి వివరాలకు సైన్స్ అధికారి మచ్చ రాజశేఖర్ ఫోన్ నంబర్ 9440212333, ఏఎంఓ రాజేశ్ 9848747580ను సంప్రదించాలన్నారు.

జగ్గసాగర్‌లో ఉరేసుకొని ఒకరి ఆత్మహత్య

మెట్‌పల్లి రూరల్, అక్టోబర్ 21: మెట్‌పల్లి మండలం జగ్గసాగర్ గ్రామంలో ఉరేసుకొని ఒకరు ఆత్మహత్య చేసుకున్న సంఘటన సోమవారం జరిగింది. ఎస్సై రాజు కథనం ప్రకారం.. జగ్గసాగర్‌కు చెందిన కుంభం వెంకన్న(58)కు భార్య, కుమారుడు, కూతురు ఉన్నారు. కుమారుడు ఉపాధి కోసం గల్ఫ్‌కు వెళ్లాడు. కాగా, నాలుగేళ్ల నుంచి వెంకన్న కడుపునొప్పితో బాధపడుతున్నాడు. ఈ నేపథ్యంలో సోమవారం ఇంటి నుంచి బయటకు వెళ్లిన వెంకన్న సాయంత్రం అయినా తిరిగిరాలేదు. కాగా, బ్రహ్మంగారి ఆలయం వెనకాల గల సొంత కొట్టంలో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. అటుగా వెళ్లిన స్థానికులకు కొట్టంలో వేలాడుతూ కనిపించగా, కుటుంబ సభ్యులకు సమాచారమందించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు.. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

గోదావరి నదిలో నీట మునిగిన ఇసుక ట్రాక్టర్

మల్లాపూర్, అక్టోబర్ 21 : మండలంలోని వాల్గొండలోని గోదావరి నదిలో గ్రామానికి చెందిన పోశయ్యకు సంబందించిన ట్రాక్టర్ పూర్తిగా నీట మునిగింది. స్థానికుల తెలిపిన వివరాల ప్రకారం.. సదరు ట్రాక్టర్ గోదావరిలో ట్రాక్టర్‌లో కూలీలతో కలిసి ఇసుకను నింపుతున్న క్రమంలో పైన ఎస్సారెస్పీ ప్రాజెక్ట్ నుంచి నీటి విడుదల చేయడంతో ఒక్కసారిగా భారీగా నీటి ప్రవహం వచ్చింది. దీంతో గమనించిన డ్రైవర్, కూలీలు ట్రాక్టర్‌ను వదిలి ఒడ్డుకు పరుగులు తీసి, ప్రాణాలను రక్షించుకున్నారు. ట్రాక్టర్ మునిగడంతో గ్రామస్తుల సహకారంతో జేసీబీ సాయంతో ట్రాక్టర్‌ను బయటకు తీశారు.

మక్కల కొనుగోలుకు జిల్లాలో 8 సెంటర్లను ఏర్పాటు

జగిత్యాల టౌన్, అక్టోబర్ 21 : మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో మక్కల కొనుగోలుకు జిల్లాలో 8 సెంటర్లను ఏర్పాటు చేసినట్లు మార్క్‌ఫెడ్ జిల్లా మేనేజర్ హబీబ్ పేర్కొన్నారు. క్వింటాలు మక్కలకు మద్దతు ధర రూ. 2225గా నిర్ణయించినట్లు ఆయన తెలిపారు. జిల్లాలోని జగిత్యాల, కోరుట్ల, కథలాపూర్, మెట్‌పల్లి, ఇబ్రహీంపట్నం, మల్లాపూర్, రాయికల్, ధర్మపురి మండల కేంద్రాల్లో మార్క్‌ఫెడ్ సెంటర్లలో రైతులు మక్కలను విక్రయించవచ్చని ఆయన పేర్కొన్నారు.

ఆలయాల్లో చోరీ చేసి.. అడ్డంగా దొరికిన దొంగ

జగిత్యాల కలెక్టరేట్, అక్టోబర్ 21 : జగిత్యాల టౌన్, జగిత్యాల రూరల్ మండలాల్లోని వివిధ ఆలయాల్లో చోరీకి చేసి, ఆ వస్తువులను అమ్ముకుందామని వెళ్తున్న దొంగ పోలీసులకు చిక్కాడు. జగిత్యాల టౌన్ సీఐ వేణుగోపాల్ తెలిపిన వివరాల ప్రకారం.. జగిత్యాల రూరల్ మండలం తాటిపెల్లికి చెందిన వడ్లూరి నాగరాజు పలు ఆలయాల్లో దొంగతనానికి పాల్పడి తప్పించుకు తిరుగుతున్నాడు. నాగరాజు కోసం మాటు వేసి జగిత్యాల పట్టణంలోని చిన్నకెనాల్ వద్ద సోమవారం పట్టుకుని విచారించగా, రెండు చోట్ల దొంగతనాలకు పాల్పడినట్లు ఒప్పుకున్నాడని తెలిపారు. చోరీ చేసిన కొన్ని వస్తువులను నిందితుడు గతంలో ఓ వ్యక్తికి విక్రయించి డబ్బులను ఖర్చు చేసుకోగా మిగిలిన రూ. 3,500, మిగిలిన వస్తువులు రాగి బిందె, రెండు రాగి ప్లేట్లు, కళశాలు, శరగోపం, ఇంత్తడి గంట,హారతి, అమ్మవారి చీర, త్రిశూలం, వెండి కన్ను, రెండు అమ్మవారి వడ్డానాలు స్వాధీనం చేసుకున్నామన్నారు. ఆలయాల్లో చోరీకి పాల్పడ్డ నాగరాజును అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపించామని సీఐ తెలిపారు.

బాధిత కుటుంబానికి మాజీ మంత్రి పరామర్శ

గొల్లపల్లి, అక్టోబర్ 21: మండలంలోని దమ్మన్నపేటకు చెందిన పాదం భాగ్య అనారోగ్యంతో మృతి చెందింది. కాగా, విషయం తెలుసుకన్న మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ బాధిత కుటుంబాన్ని సోమవారం పరామర్శించారు. మాజీ జడ్పీటీసీ జలెందర్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ హన్మాండ్లు, బీఆర్ఎస్వీ రాష్ట్ర కార్యదర్శి పాదం తిరుపతి, నాయకులు లక్ష్మణ్, రాజిరెడ్డి పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల క్షేత్ర స్థాయి పర్యటన

కోరుట్ల రూరల్, అక్టోబర్ 21 : మండలంలోని ప్రభుత్వ ఉపాధ్యాయులు సోమవారం క్షేత్ర స్థాయి పర్యటనలో భాగంగా కవ్వాల్ పెద్దపులుల రక్షిత అభయారణ్యం, కడెం డ్యామ్ రూట్ మ్యాప్, ఏరియల్ సర్వే నిర్వహించారు. మండలంలోని పైడుమడుగు గ్రామంలో అతి పెద్ద మర్రిచెట్టు, కట్కాపూర్ వెన్న ముద్దల గండి జలపాతం, కమ్మనూరు కలమడుగు గోదావరి వంతెన, జన్నారంలోని కవ్వాల్ పులుల రక్షిత అభయారణ్యాన్ని సందర్శించారు. క్షేత్ర పర్యటన ద్వారా పాఠశాలలో బోధించే వివిధ సబ్జెక్టులైన సాంఘిక శాస్త్రం, జీవశాస్త్రం, భౌతిక శాస్త్రానికి సంబంధించిన చరిత్ర, శిలాజాలు, గోదావరి నది పరివాహక ప్రాంతంలో ప్రజల జీవనస్థితిగతులు ఆహారపు అలవాట్లు, వ్యవసాయం, చారిత్రక కట్టడాలు, జలపాతాలు, అంతర్ జిల్లా రవాణా సౌకర్యాలు విషయాలు తెలుసుకున్నట్లు ఉపాధ్యాయులు తెలిపారు. హెచ్ఎం ఆనంద్‌రావు, కిషన్, ఉపాధ్యాయులు రాంప్రసాద్, శశిధర్, సత్యనారాయణ, గంగాధర్, మోహన్ రెడ్డి, రామారావు

హత్యకు కారణమైన మరొకరి అరెస్ట్

కథలాపూర్, అక్టోబర్ 21 : మండలంలోని చింతకుంట గ్రామానికి చెందిన నేతుల మల్లేశం హత్యకు కారణమైన రెండో వ్యక్తి మెట్‌పల్లి పట్టణానికి చెందిన కడ గంగమల్లయ్యను సోమవారం అరెస్టు చేసినట్లు ఎస్ఐ నవీన్‌కుమార్ తెలిపారు. ఈ నెల 1న నేతుల మల్లేశం హత్యకు గురైన విషయం తెలిసిందే. హత్య